
# తేజ

## శ్రీమతి శేషు అప్పారావు



షెరటన్ హోటల్ రూమ్ విండోలోంచి అత్యంత సుందరంగా కనపడుతోంది నయాగరా జలపాతం రాత్రి కావడంతో రంగు రంగుల లైట్లు ఆ జలపాతం వైపు ఫోకస్ చేస్తున్నారు ఈ రీలేక్ వచ్చి నయాగరా నదిలో పడడంతో ప్రకృతి అత్యంత సుందరమైన నయాగరా జలపాతాన్ని సృష్టించింది ప్రపంచంలో కెల్లా పెద్ద జలపాతంలా రూపొందింది అక్కడ కూడా జనం రెయిన్ కోట్లలో దగ్గరగా నిలబడి ఆ ఫాల్స్ అందాన్ని చూస్తున్నారు ఒంటిమీద ఆ జలపాతం నుండి పడే తుంపరులు పన్నీటి జల్లుల్లా ఫీలవుతూ దగ్గర నుండి ఆ ఫాల్స్‌ని చూడడం నాకు బలే సరదా ఎన్ని వందలసార్లు చూసినా నాకు ఆ జలపాతం నిత్యనూతనంగా కనపడుతుంది ఈ నయాగరా ఫాల్స్‌ని సొంతం చేసుకోగలిగిన అదృష్టం కెనేడియన్స్‌కీ, అమెరికన్స్‌కీ దక్కింది కెనేడియన్ సైడ్ హార్స్ ఘూ ఫాల్స్ అమెరికన్ సైడ్ కంటె పెద్దది చాలా అందంగా వుంటాయి సాధారణంగా టూరిస్ట్‌లు రెండు వైపులా చూసి మరీ వెడుతూంటారు అమెరికా, కెనడా దేశాలు బోర్డర్లు దాటటానికి కూడా ఫార్మాలిటీస్ తక్కువ ఈ రెండు దేశాల మధ్య వున్న స్నేహ సంబంధమే దీనికి కారణం

''డాడీ! బ్లాంకెట్ కప్పు'' అన్న ఉమ మాటలతో నేను విండో నుండి దృష్టి మళ్ళించి కుర్చీలోంచి లేచాను పగలంతా 'మేపుల్ లీఫ్ విలేజ్'కి అన్ని రకాల రైడ్సులోను వెళ్ళి బాగా అలిసిపోయింది మూడేళ్ళ ఉమ మంచం మీద అటూ ఇటూ ఉమని, ఆరునెల్ల బాబుని పడుకోబెట్టుకుని మధ్యలో తనుపడుకుని హాయిగా నిద్రపోతోంది సుధ రోజంతా ఎండలో తిరగడం మూలంగా బాగా అలిసిపోయింది సుధ వాళ్ళ ముగ్గురినీ అలా చూస్తుంటే నాలో ప్రేమ పెల్లుబికింది వాళ్ళ ముగ్గురికీ దుప్పటి కప్పి నైట్ లైట్ ఆఫ్ చెయ్యబోయిన నాకు పొద్దున్న బేబీసిట్టర్ ఇచ్చిన మెస్సేజ్ కనిపించింది మరొక్కసారి చదివాను ''ప్లీజ్ కమ్‌టు షెరటన్ ఫ్రైడే, ఐ వాంట్‌టు ఇంట్రొడ్యూస్ విక్రమ్ టు యూ ఐ కేమ్‌బాక్ ఫ్రమ్ ఇండియా ఎస్టర్‌డే వుయ్ బోత్ విల్ సీ యూ ఆల్ ఫ్రైడే మిడ్‌నైట్ ''—తేజ

తేజ మాకు ప్రాణ స్నేహితురాలు అమెరికాలో 'బఫెలో' అనే వూళ్ళో సర్జన్‌గా ఒక హాస్పిటల్‌లో పనిచేస్తోంది మేమందరమూ అప్పుడప్పుడూ నయాగరా ఫాల్స్ షెరటన్‌కి కలుసుకోటం అలవాటే ఈసారి మాగెట్‌టుగెదర్‌కి మటుకు ఒక విశేషం వుంది ''ఈ విక్రమ్ కాలేజీకి నాకు తెలిసిన వ్యక్తి ఎవరైనానా?'' ఆలోచిస్తూ వచ్చి మళ్ళీ విండో దగ్గర కుర్చీలో కూలబడ్డాను వాచ్ వైపు చూస్తే పదింపావు అయింది అంటే, తేజా, విక్రమ్ త్వరలో ఇక్కడికి వస్తారన్నమాట ఈ సస్పెన్స్ భరించరానిదిగా వుంది తేజ పెళ్ళి చేసికొన్న ఈ విక్రమ్ ఎవరో చాలా అసాధారణ వ్యక్తి అయివుండాలి ఇండియా విజిట్‌కి వెడుతున్నానని మాత్రమే చెప్పివెళ్ళింది తేజ ''పెళ్ళి చేసికొందుకు వెడుతున్నావేమిటే తేజా!'' అని సుధ వేళాకోళం చేస్తే ''ఆ ఉద్దేశం లేదని'' ఖచ్చితంగా చెప్పింది మా ఇద్దరి దగ్గరా ఏ విషయం దాచే అలవాటు లేదు తేజకి తేజ ఈ విక్రమ్ అనే వ్యక్తిని చూడగానే మనస్సు మార్చుకుందేమో! ఎంతైనా స్త్రీ! భర్త, పిల్లలు, సంసారం కావాలని అనుకోడం సహజం కానీ, తేజ అందరిలాంటి మామూలు వ్యక్తికాదు


తేజ! ఆ పేరులోనే ఏదో ప్రత్యేకత, నిండుతనం, ఆకర్షణ వున్నాయి సుమారు ఐదు అడుగుల ఒక అంగుళం హైట్ వుంటుంది చామన ఛాయ, పట్టుదలనీ ఆత్మ విశ్వాసాన్ని సూచించే లాంగ్, షార్ప్‌నోస్, ప్రతిదాన్ని నిశిత దృష్టితో చూసే అందమైన కళ్ళు, ఎప్పుడు చెక్కు చెదరని నిర్మలమైన చిరునవ్వు—ఆమెలోని ప్రత్యేకత ఆమె మంచి మనసుకి తగినట్లుగానే ఎప్పుడూ తెల్లని ప్రింటెడ్ చీరెలే కడుతుంది నేనూ, సుధా, తేజా ఒకటో క్లాస్ నుండీ యమ్ బి బి యస్ అయ్యేవరకూ క్లాస్ మేట్స్ మేము చాలా క్లోజ్ ఫ్రెండ్స్ మా ముగ్గురి కుటుంబాల్లో వాళ్ళుకూడా స్నేహితులు కావడంచేత మా స్నేహానికి ఎవరూ ఎప్పుడూ అడ్డుచెప్పలేదు చదువు అయిపోగానే నేనూ, సుధా పెళ్ళి చేసుకున్నాం తరువాత కెనడా వచ్చేశాము మనుషులం దూరం అయినా మా మధ్య స్నేహం మాత్రం చెక్కుచెదరలేదు నేను ఇక్కడే ఒక పిల్లల హాస్పిటల్‌లో పీడియాట్రిషియన్‌గా వుంటున్నాను సుధ ఈ పరీక్షలు

హెక్టిక్ వర్క్ షెడ్యూల్, నా నుండి ఎక్కువ కోఆపరేషన్‌లేని కారణాలచేత ఇంట్లోనేవుంటూ పిల్లల్ని, సంసారాన్ని చూసుకుంటోంది ''ఇంత చదువూ చదివి అంతా వేస్ట్‌చేస్తున్నావు సుధా!'' అంటే, ''పిల్లలు ఫుల్‌టైమ్ స్కూల్‌కి వెళ్లడం మొదలుపెట్టాక నా కెరియర్ సంగతి చూసుకుంటాను అయినా ఇప్పుడు నాకు ఏమి లోటు వచ్చింది ? హాయిగా పిల్లల్ని చూసుకుంటూ సుఖంగా వున్నాను నేను ఎక్కువ కష్టపడలేను బాబూ!'' అంటుంది పరిస్థితులకి తగినట్టుగా సర్దుకుపోయి జీవితాన్ని సుఖమయం చేసుకోవాలని చూస్తుంది సుధ కష్టతరమైన గోల్స్ పెట్టుకొని, వాటిని సాధించడానికి ప్రయాసపడదు తనకి లేనివాటిని గురించి బాధపడుతూ డిప్రెస్ అవ్వదు ఒక్కొక్కసారి నాకు వాళ్ళ నాన్నగారు అనవసరంగా డబ్బు ఖర్చుచేసి తనకి మెడిసిన్ చెప్పించారనిపిస్తుంది సుధ ప్లేస్‌కి బాగా ఇంట్రెస్ట్ వున్న మరో వ్యక్తి మెడిసిన్ చదివి వుంటే ఆ చదువుకీ విలువవుండేది పిల్లల్ని పెంచడం, సంసారం ముందు, ఈ ప్రపంచంలో మిగిలిన విషయాలన్నీ సుధ దృష్టిలో చాలా అల్పమైనవి నా మటుకు నాకు సుధ ఇంట్లో వుండి అన్ని విషయాలూ చక్కబెట్టుకోవడం చాలా సుఖంగా వుంది అందుకే నేను మరీ ఎక్కువగా తనని కెరియర్ విషయమై ఎంకరేజ్ చెయ్యటంలేదు లాంగ్ అవర్స్, విపరీతమైన పనీ, ఒక్కొక్కసారి గొడ్డు చాకిరీలా వుంటుంది డాక్టర్స్ పని ఇక్కడ

నేను స్త్రీగా పుట్టివుంటే ఏం చేసేవాడినో! మొగవాణ్ణి కాబట్టి కెరియర్, మంచి జీతం తెచ్చే ఉద్యోగం చాలా అవసరమని చిన్నప్పుడే గ్రహించాను పట్టుదలతో మెడిసిన్, తరువాత పిడియాట్రిక్స్ స్పెషలైజ్ చేశాను మంచి ఉద్యోగంలో వున్నాను నన్ను ప్రాణంగా చూసుకునే భార్యా, ఇద్దరు పిల్లలూ వున్నారు చిన్నప్పటినుండీ నేను కన్న కలలన్నీ ఫలించాయి అయినా నాలో ఏదో అసంతృప్తి ఈ ఉద్యోగం, ప్రెషర్‌నుండి ఎక్కడికైనా పారిపోవాలి అనిపిస్తుంది ఎక్కువగా పని వుండడం మూలంగా సుధతోనూ, పిల్లలతోనూ ఎక్కువ టైమ్ స్పెండ్ చెయ్యలేకపోతున్నాను ఇంట్లో వున్నంతసేపూ హాయిగా పడుకోవాలనిపిస్తుంది ఈ సంపాదనకీ, చదువుకీ అర్థం ఏమిటి అనిపిస్తుంది సుధని చూస్తేకూడా నాకు ఒక్కొక్కసారి జెలసీగా వుంటుంది సుధ ఇంట్లోనే వుండాలని డిసైడ్ చేసుకుంది హాయిగా వుంటోంది కానీ, సుధకున్న ఛాయిస్ నాకు లేదు — నేను మొగవాణ్ణి కనుక నేను ఆ మాటే సుధతో అంటే, ''పోనీ నువ్వు హౌస్—హజ్‌బెండ్‌గా వుండు నేను నా కెరియర్ సంగతి చూసుకుని నిన్నూ, పిల్లలనీ పోషిస్తాను'' అని నవ్వుకుంది సుధ ఆ నవ్వు చూస్తే నాకు ఒళ్ళు మంట నా 'మేల్ ఈగో'కి నచ్చని విషయం అది

తేజలా పెళ్ళి చేసుకోకుండా వుంటేనో ? అప్పుడు ఈ సంపాదన అవసరం, భార్యా పిల్లలతో టైమ్ గడపడంలేదన్న బాధ వుండవు కానీ కెరియర్, సంసారం రెండూ కావాలి నాకు అన్నీ కావాలని అనుకున్నప్పుడు ఒకరకంగా కాంప్రొమైజ్ అవ్వక తప్పదు తేజ కూడా ఇప్పుడు సేమ్‌బోట్‌లోకి ప్రవేశిస్తోందంటే ఒకరకమైన ఆనందం కలుగుతోంది ఇప్పటి వరకూ తేజ అంటే గౌరవం, ఇష్టంతోపాటు కొద్దిగా జెలసీ కూడా వుండేది నాకు తేజ దగ్గఱ నేను కొద్దిగా ఇన్‌ఫీరియర్‌గా ఫీలవుతాను తేజ జీవితంలో డెఫినిట్ గోల్స్ పెట్టుకుంటుంది అవి ఎఛీవ్ చేసేదాకా నిద్దరపోదు జీవితంలో సక్సెస్ అవ్వడానికి కావలసిన తెలివి, పట్టుదల, ఆత్మబలం, కార్యదీక్ష తేజకి వున్నాయి అవసరమైతే స్నేహితులకి ప్రాణాన్ని అయినా త్యంజించేంత స్నేహశీలత వుంది తేజలో తను పుట్టి పెరిగిన పరిస్థితుల్లో తేజ కాబట్టి ఇంత సక్సెస్ కాగలిగింది మెరిట్ స్కాలర్‌షిప్‌లోనూ యం బి బి యస్ పాసైన తేజ హైయర్ స్టడీస్‌కి వెళ్లకుండా ఉద్యోగంచేసి చిరునవ్వుతో చెల్లెళ్లని, తమ్ముళ్లని సెటిల్ చేసింది తమ్ముళ్లకి ఉద్యోగం రాగానే తల్లి దండ్రుల్ని వాళ్ల దగ్గరకు పంపించింది ''ఇప్పటికి నాకు హైయర్ స్టడీస్‌కి తీరిక దొరికింది ఇప్పుడు నాకు పెళ్లికీ, పిల్లలకీ టైమ్ లేదని'' ఖచ్చితంగా ఇంట్లో వాళ్లకి చెప్పింది ఈనాడు తేజ యు యస్ లో మంచి పేరు గల సర్జన్‌లలో ఒకత్తె ఆమె సర్జరీ ఎంత నేర్పుగా, చక్కగా సునాయాసంగా చేస్తుందో నాకు కాలేజీలో చదివే రోజుల నుండి తెలుసు సర్జరీ కోసమే ఆమె చేతులు సృష్టించబడ్డాయా— అనిపిస్తుంది తేజ మా సర్జరీ ప్రొఫెసర్‌కి ఫేవరేట్ స్టూడెంట్ ఆమె ఆయనకే కాదు, అందరికీ ఫేవరేటేను విద్యార్థులకి తేజ అంటే గౌరవం, అభిమానం, భయం గూడా వున్నాయి తేజకి 'వాకింగ్ లైబ్రరీ' అని ఒక బిరుదు కూడా వుండేది సాధారణంగా చదువుల్లో ఫస్ట్‌గా వుండేవాళ్లు మిగిలిన విషయాల్లో కాస్త డల్‌గా వుంటారు తేజ విషయంలో మటుకు ఇది నిజం కాదు అటు కర్నాటక సంగీతం, ఇటు సినిమా పాటలూ కూడా చాలా చక్కగా పాడేది డిబేట్లలో తేజ మాట్లాడితే— తను నెగ్గాల్సిందే— టెన్నిస్ తేజ హాబీలలో ఒకటి వంట కూడా చాలా బాగా చేసేది నన్నూ, సుధని అప్పుడప్పుడు తన రూమ్‌కి లంచ్‌కి పిలిచేది చిత్రలేఖనంలో కూడా మంచి ప్రావీణ్యం వుంది తేజకి అప్పుడప్పుడూ పత్రికలకి కథలూ, వ్యాసాలు కూడా వ్రాసేది మా కాలేజీలో వాలంటీర్ ఆర్గనైజేషన్ మొదలు పెట్టింది తేజే మా హాస్పిటల్‌కి పేషంట్స్‌కి ఏ అవసరంకల్గినా ఈ వాలంటీర్లు సహాయపడేవాళ్ళు ఇన్ని పనుల్లో ఇన్‌వాల్వ్ అవ్వడానికి తేజకి ఎలా టైమ్ వుండేదో నాకు అర్థం కాదు బహుశా మా అందరిలాగా పుస్తకాలతో ఎక్కువ కుస్తీ పట్టక్కర్లేదు— తేజలాంటి ఏకసంతాగ్రాహి ఎరేంజ్‌డ్ వివాహాలమీద తేజకి అంత మక్కువ లేదు వరకట్నాలు తీసుకొని జరిగే పెళ్ళిళ్ళకు తేజ ఎప్పుడూ అటెండ్ అయ్యేది కాదు నేను కట్నం తీసికొన్నానన్న కోపంతో ప్రాణస్నేహితులమైన మా పెళ్ళికి కూడా తేజ రాలేదు తను నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్ని కష్టాలైనా భరించగలదు తేజ తేజలాంటి వ్యక్తి నా స్నేహితురాలైనందుకు నేను చాలా గర్విస్తాను, గౌరవిస్తాను కూడా తేజలాంటి వ్యక్తిని భార్యగా మటుకు భరించి, గౌరవించగలనని నేను అనుకోను

తేజ వరించి చేసుకున్న ఆ విక్రమ్‌ని చూడాలని పరితపించిపోతోంది నా మనస్సు విక్రమ్ చాలా గొప్ప వ్యక్తిత్వం కలవాడై వుండాలి బహుశా తేజలాగే జీనియస్ అయి



వుంటాడు కెరియర్‌కి అతిగా విలువ యిచ్చే మా నలభై ఏళ్ళ బ్రహ్మచారిణికి ఈనాటికి విక్రమ్ అనబడే భర్త దొరికాడంటే నాకు చాలా ఆనందంగా వుంది పెళ్ళి శుభలేఖ అయినా పంపకుండా, మాట మాత్రంగానైనా చెప్పకుండా ఇలా హఠాత్తుగా "విక్రమ్‌ని పరిచయం చేస్తాను" అని తేజ మమ్మల్ని సర్‌ప్రయిజ్ చేసిన వైనం మా ఇద్దరికీ కోపం తెప్పించింది నా మటుకు నేను తేజలాంటి సక్సెస్‌ఫుల్ లేడీకి, నలభైలో పడ్డాక, పైగా అమెరికాలో ఉద్యోగం చేస్తున్న అమ్మాయికి ఇంత ఈజీగా పెళ్ళి అవుతుందని ఎప్పుడూ అనుకోలేదు

"నిరంజన్! పన్నెండు గావస్తోంది తేజవచ్చే వేళవుతోంది నువ్వు కూడా కాస్త ఫ్రెషనప్ అవ్వు మొదటిసారిగా విక్రమ్‌ని కలుసుకోబోతున్నాం నిద్రమొహాలతో వెల్‌కమ్ చెబితే బాగుండదు అలా కిటికీలోంచి చూస్తూ కాలక్షేపంచెయ్యక లే" వాష్‌రూమ్ లోంచి ఒకవైపు టాప్ చప్పుడూ, మరొక వైపు సుధ వాక్ప్రవాహం

నా ఆలోచనలకి స్వస్తి చెప్పి నేను కూడా వాష్‌రూంలోకి నడిచాను

"ఒక్క కునుకు తీస్తే హాయిగా వుంది బాబూ!" ఒళ్ళు విరుచుకుంది సుధ

"నువ్వు హాయిగా ఎలా నిద్రపోగలిగావ్? విక్రమ్ గురించీ తేజ గురించీ అసలు ఆలోచించటం లేదా?"

"నీలాగే నేను కూడా షాపింగ్ నుండి ఇంటికి వచ్చి మెస్సేజ్ చూసి ఆశ్చర్యపోయాను ఆలోచిస్తే అంతగా ఆశ్చర్యపడవలసినది ఏమీ లేదనిపిస్తోంది ఇన్నాళ్ళకి తేజ తను అనుకున్నవన్నీ సాధించింది చక్కగా మంచి హోదాలో వుంది పిల్లలూ, మొగుడూ కావాలనుకుంది ఆ మిష్టర్ రైట్ ఎవరో కనిపించగానే పెళ్ళి చేసుకుంది వాళ్ళిద్దరూ రాగానే మనకి అన్ని విషయాలూ తెలుస్తాయి"

సుధ అనవసరంగా ఏ విషయం గురించీ అతిగా ఆలోచించి బుర్ర వేడెక్కించుకోదు ప్రతీ సమస్యకీ ఏదో ఒక ఈజీ సొల్యూషన్ చూస్తుంది

"సుధా! తేజ నిస్పృహతో ఏ రెండో పెళ్ళివాడినైనా పెళ్ళి చేసుకుందేమో! ఏమిటో తేజని ఒకరికి వైఫ్‌గా నేను ఊహించలేకపోతున్నాను"

"నిరంజన్! నువ్వు మగాడివి కనుక తేజలాంటి సక్సెస్‌ఫుల్ ఆడవాళ్ళలో దాగివుండే స్త్రీత్వం చూసి వుండవు మనకి పిల్లలు పుట్టిన దగ్గర నుండీ తేజలో మరో సైడ్ నాకు కనపడుతోంది మన పిల్లల్ని దగ్గరకు తీసుకున్నప్పుడు తేజ కళ్ళల్లో మెరుపు, వాళ్ళని గుండెలకు దగ్గరగా తేజ హత్తుకునే తీరు చూస్తుంటే లప్పుడప్పుడు నాకు తేజ పైన జాలి కూడా





వేసేది అనవసరంగా గోల్స్ అంటూ పెట్టుకుని, జీవితంలో వయస్సులో వున్నప్పుడు పెళ్ళి చేసుకోకుండా, పిల్లల్ని కనకుండా అత్యంత ఆనందాన్నిచ్చే అనుభవాలకు దూరమైంది తేజ ఈనాటికి తనకు కావలసిన దేమిటో గ్రహించి పెళ్ళి చేసుకుంది దేవుని దయవల్ల తల్లి కూడా అయితే తేజ జీవితానికి పరిపూర్ణత లభిస్తుంది."

స్త్రీలందరికీ పెళ్ళి, పిల్లలతోకాని సరిపూర్ణత లభించదని సుధ ఉద్దేశం కాబోలు తేజ, సుధ ప్రాణ స్నేహితులైనా విభిన్న వ్యక్తిత్వాలు అప్పుడప్పుడూ చాలా ఎమోషనల్‌గా వాళ్ళిద్దరూ ఆర్గ్యూ చేసుకోడం వాళ్ళకి అలవాటే

తలుపుమీద టిక్, టిక్‌మన్న చప్పుడుతో ఒక్క ఉదుటున్న వెళ్ళి తలుపు తెరిచాను నా వెనుకే సుధ కూడా వచ్చింది ఒక స్ట్రోలర్‌ని త్రోసుకుంటూ రూమ్‌లోకి వచ్చింది తేజ ఎప్పటిలాగే చిరునవ్వుతో మొహం కళకళలాడుతోంది ఒక్కసారి తేజ మీదనుండి నా దృష్టి స్ట్రోలర్‌లో వున్న బేబి మీదకు మళ్ళింది ప్రశాంతంగా నిద్రపోతున్నాడు మూడు నెలల వయసులో వున్న బాబు చక్కటి లేస్ వైట్ షాల్ బేబిమీద కప్పబడి వుంది

"మై గాడ్! పిల్లలున్న వాడిని చేసికొంది తేజ షి డిజర్వ్స్ మోర్ దేన్ దట్" నాలో నేను అనుకుని తేజ భర్త తేజ వెనకాలే వస్తున్నాడేమో అని కుతూహలంతో చూస్తున్నాను

"ఏమిట్రా! నన్ను లోపలికి రానివ్వరా?" నవ్వుతూ అంది తేజ

"సారీ! లోపలికి రా తేజా!" మేమిద్దరం ప్రక్కగా తొలగి తేజ పూర్తిగా లోపలికి రావడానికి చోటిచ్చాము

"ఈ వయస్సుకి పసిపిల్లలకి అస్తమానా

## దర్శనం

ఇతరులకి
'పరం' బోధిస్తూ తాము
'ఇహం' చూసుకుంటూ
'అహం' పెంచుకుంటూ
దేశంలో సహానికి సహం
దోచుకునే
ఈనాడు
నెత్తుటిలో
'తాన' మాడిన కత్తులే
'రాగ' ద్వేషాలతో
పల్లవిస్తూ
మఠాలలో ముఠాలతో
దర్శనమిస్తాయ్!!!

— రామసూరి

ఫీడింగ్ లే అనుకోండి బాటిల్ వేడి చేసి రెడీగా వుంచాలి లేకపోతే వీడు లేవగానే షెరటన్‌ని అదర గొట్టేస్తాడు" పిల్లవాడి వైపు తన్మయత్వంతో చూస్తూ అసలైన సిసలైన తల్లిలా అంది తేజ

"నేను ఆ పని చేస్తాలే! నువ్వు కాస్త రిలేక్సు అయి నిరంజన్‌తో మాట్లాడుతూండు" సుధ బాటిల్ తీసుకుంది

తేజ అక్కడే బెడ్ మీద వున్న దిండుకు తలని ఆన్చి కాళ్ళు జాపి మంచం మీద కూర్చుంది

"మీరిద్దరూ సర్‌ప్రయిజ్ అయ్యారా? సారీ నిరంజన్! నేను ఏమి చేయదల్చుకున్నానో ఇండియా వెళ్లేవరకూ నాకే తెలియదు" తేజ కూడా కొన్ని విషయాలలో అటూ—ఇటూగా ఆలోచిస్తుందన్న విషయం మొదటిసారిగా చూసి ఆశ్చర్యపడ్డాను

"ఇంతకీ మీ ఆయన ఏరీ? పెళ్లికొడుకు గారి మేకప్ పూర్తి అవ్వలేదా?"

ఈ సస్పెన్స్ భరించలేకుండా వున్నాను నేను

"వాట్?" అంటూ తేజ పడీ పడీ నవ్వుతోంది

నాకు ఒళ్లు మండింది

"తేజా! సుధకీ, నాకు ఈ సస్పెన్స్ చాలు, మీ ఆయన్ని చూపించు త్వరగా!" అరిచినట్లుగా అన్నాను

"పెళ్లి కాకుండా మొగుడని ఎవరిని చూపించను నిరంజన్" ఆశ్చర్యపోతోంది తేజ

"తేజా!" అప్పుడే బాటిల్ వేడి చేసి తీసుకొచ్చిన సుధ షాక్ తగిలినట్లు చూసింది "తేజా! ఈ దేశాల్లో ఎన్ని ఏళ్ళుగా వుంటున్నా ఈవినింగ్ టు గెదర్ టైప్ మనకి సరిపడదు మా మాట విని అఫీషియల్‌గా అతన్ని పెళ్లి చేసుకో ఇది నీకూ విక్రమ్‌కీ, ఈపిల్లవాడికీకూడా మంచిది" నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తోంది సుధ

"సుధా? నేను మిమ్మల్ని నా మెసేజ్ ద్వారా కన్‌ఫ్యూజ్ చేసి వుంటే సారీ! ఈ పసివాడు విక్రమ్ వీడినే నేను మీకు పరిచయం చేస్తానన్నది నేను ఈ బాబుని ఎడాప్ట్ చేసుకుని తీసుకువచ్చాను ఈ విషయాలన్నీ ప్రాణ స్నేహితులైన మీకు చెప్పాలనే మిమ్మల్ని ఇక్కడకు రమ్మన్నాను" పిల్లాడిని భుజంమీద పడుకోబెట్టుకుని బర్ప్ చెయ్యడానికి ప్రయత్నిస్తోంది తేజ ఎంతటి కష్టతరమైన ఆపరేషన్ అయినా ఎంతో నైపుణ్యంతో చేసే ఆ చేతులు, ఎన్నో ఎవార్డ్సు, మెడల్సు అందుకోడానికి అలవాటైన ఆ చేతులు — అతి చక్కగా బాబుని జోకొడుతున్నాయి

తేజని అలా చూడడం నాకు చాలా విచిత్రంగా వుంది తేజవైపే నిశ్చేష్టుణ్ణై అయి చూస్తున్న నేను సుధ మాటలతో బాహ్య ప్రపంచంలోకి వచ్చాను

''ఈ పిల్లాడు ఎవరి పిల్లాడు ? నీకెలా దొరికాడు ?''

ఏం సమాధానం చెబుతుందోనని మేమిద్దరం కుతూహలంగా తేజవైపు చూస్తున్నాము

''నేను ఈ పిల్లాడిని ఒక అనాధ ఆశ్రయం నుండి తెచ్చుకున్నాను. కులమేదో, మతమేదో తెలీదు. తల్లి ప్రేమకోసం అలమటించే కొన్ని వేలమంది అనాధలలో వీడు ఒకడు. మాతృత్వం కోసం పరితపించే స్త్రీలలో నేను ఒకదానిని. మా ఇద్దరికీ ఒకరి అవసరం ఒకరికి వుంది'' ఒక బేబీ బెడ్‌షీట్‌ను పొందికగా మంచంమీద పరిచి విక్రమ్‌ను జాగ్రత్తగా దానిమీద పడుకోబెట్టింది తేజ.

''భార్యా, భర్తా పిల్లలు పుట్టకపోతే పిల్లల్ని పెంచుకోడం సహజం ఇలా పెళ్ళికాని ఒకస్త్రీ పిల్లాడిని పెంచుకోడం మన సంఘం హర్షిస్తుందా ? నువ్వు అనవసరమైన సమస్యల్ని తెచ్చి పెట్టుకుంటున్నావ్ !''

''నిరంజన్ ! పెళ్ళిచేసుకుని, పిల్లల్ని కనవలసిన వయస్సులో నాకు వాటిమీదకు మనసు పోలేదు ఆ వయస్సులో కుటుంబ బాధ్యతలు తీర్చుకోడం, కెరియర్ అన్నింటికంటె ముఖ్యంగా వుండేవి. వీటిల్లోనే నాకు అపరిమితమైన తృప్తీ ఆనందం లభించేవి. తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ బాగా సెటిల్ అయిన రోజున ఎంతో సంతోషించాను. గర్వపడ్డాను. తరువాత హయ్యర్ స్టడీస్‌కి ఇక్కడకు రావడం, ఇక్కడ సెటిల్ అవ్వడం జరిగింది. అనుకున్నవన్నీ ఎఛీవ్ చేసి జీవితంలో బాగా సెక్సస్ అయ్యాక నా జీవితంలో ఒక రకమైన శూన్యత ప్రవేశించింది ఏకాకిలా ఫీలవడం మొదలు పెట్టాను. నాక్కూడా ఫేమిలీ వుంటే బాగుండును అనిపించింది. నా వయస్సు నలభై. నా వయస్సును చూసి నేను ఏ మాత్రం సిగ్గుపడను. నలభై ఏళ్ళ వయస్సులో నేను ఎన్నో ఎఛీవ్ చేశాను. ఐ యామ్ ప్రౌడాఫ్ మై ఏజ్ అండ్ ఎఛీవ్‌మెంట్స్. నాలో ఫేమిలీలైఫ్ కావాలనే కోరిక రోజు రోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా మీ పిల్లల్ని చూశాక నాలో మాతృత్వ కాంక్ష మరీ పెరిగింది తగిన వయసుండీ, నాకు నచ్చే, నన్ను మెచ్చే భర్త లభించడం అంత సులభం కాదు. భర్తకంటే కూడా పిల్లలు లేకుండా బ్రతకలేనని అనిపించసాగింది. ఒకవేళ నేను ఎవరినైనా పెళ్ళిచేసుకున్నా ఈవయస్సులో పిల్లల్నికనడం రిస్కేను. నేను పిల్లలవిషయంలో ఏ మాత్రం రిస్క్ తీసుకుందుకు సిద్ధంగాలేను. పైగా, మన దేశంలో అనేకమంది అనాధ పిల్లలు వున్నారు. వారిలో ఒకరికైనా నేను తల్లి కాగలిగితే బాగుండునని అనుకున్నాను. సొంత పిల్లలే వుండాలని ఏముంది ? మొన్న ఇండియా ట్రిప్‌తో నా కోరిక ఫలించింది.'' విక్రమ్ ఏడవడంతో మాట్లాడ్డం ఆపి వాడిని భుజం మీద పడుకోబెట్టుకుంది తెజ.

''మీ ఇంట్లో ఎవరూ ఏమీ అనలేదా ?'' సుధ విస్మయంగా తేజ వైపే చూస్తోంది.

మెల్లిగా నవ్వింది తేజ. ''మీరడిగిన ప్రశ్నలే వాళ్ళూ అడిగారు. నేను స్వతంత్ర్యరాలిని. పిల్లాడిని పెంచి పోషించగల శక్తీ, డబ్బూ నాకు వున్నాయి. అన్నిటినీ మించి ప్రేమించగల మనస్సు నాకు వుంది ఈ సమాజమనబడే మహా సముద్రంలో నేనొక నీటిబిందువుని. నేను ఈ పిల్లాడిని పెంచినా, పెంచకపోయినా, ఈ సమాజంలో పెద్దగా జరిగే మార్పు, లోటు ఏమీ లేదు. అలాంటప్పుడు ఈ సంఘాన్ని పట్టించుకోవల్సిన అవశరం నాకు లేదు. మా పిల్లల్లో ఒకళ్ళని పెంచుకోరాదా – అన్నారు చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూను.

తల్లిదండ్రుల దగ్గర సుఖంగా వున్న పిల్లల్ని వేరుపరిచేంత అవసరం లేదు. నేను కులం, మతం తెలీని పిల్లాడిని పెంచుకున్నందుకు ఎవ్వరూ హర్షించలేదు. రక్తసంబంధం లేని పిల్లాడు ముసలితనంలో నన్ను చూడడని అందరూ అన్నారు. నా ముసలితనం కోసం ఈ పిల్లాడిని పెంచి పెద్దవేయుటం లేదు. కేవలం పిల్లల్ని పెంచి పెద్ద చేయడంలో కలిగే ఆనందం కోసమే నేన ఈ పిల్లాడిని పెంచుతున్నాను. రెక్కలు వచ్చాక ఈ ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్ళే స్వాతంత్రం ఈ పిల్లాడికి వుంది. నేను కేవలం నా సంతోషం కోసం, నా స్వార్థం కోసం ఈ పిల్లాడిని పెంచుకుంటున్నా. నాకు ఏరకంగానూ విక్రమ్ ఋణపడి వుండడు.'' తేజ గుండెలమీద కౌగిలించుకున్నట్లుగా పడుకున్నాడు విక్రమ్. ఆ పసివాడి స్పర్శలో ఒక అనిర్వచనీయమైన అనుభూతికి లోనవుతోంది తేజ.

భుజంమీద నుండి పిల్లాడిని తీసి స్ట్రోలర్‌లో పడుకోబెట్టింది తేజ.

''ఇంక నేను నా రూమ్‌కి వెళ్ళి పడుకుంటాను. వీడితో చాలా అలసటగా వుంటోంది. నేను హాస్పటల్‌కి వెళ్ళినప్పుడు విక్రమ్‌ని చూసేందుకు నానీని పెట్టాను. నానీకి వీడు అలవాటు అయ్యేదాకా నాకు వర్రీ తప్పదు.'' పిల్లాడికోసం ఆ తల్లి మనస్సు ఆరాటపడుతోంది.

''తేజా! నీకు ఇక పెళ్ళి చేసుకొనే ఉద్దేశం లేదా?'' నాకు తేజ విచిత్రంగా అనిపిస్తోంది.

''నన్నూ, విక్రమ్‌ని ప్రేమతో స్వీకరించగల వ్యక్తి దొరికినపుడు ఆ వ్యక్తిని తప్పక నా జీవితంలోకి ఆహ్వానిస్తాను. ఆ వ్యక్తి కులంతోనూ, మతంతోనూ, రంగువుతోనూ, ఉద్యోగంతోనూ, నేషనాలిటీతోనూ నాకు పని లేదు. ఆ వ్యక్తి రెండో పెళ్ళివాడైనా నాకు అభ్యంతరం లేదు. పిల్లల తండ్రి అయినా కూడా ఆ పిల్లలని, ఆ వ్యక్తిని నేను మనస్ఫూర్తిగా నా జీవితంలోకి ఆహ్వానిస్తాను. అలాంటి సంస్కారవంతుడు దొరికినప్పుడు తప్పక పెళ్ళి చేసుకుంటాను'' నవ్వుతూ గుడ్‌నైట్ చెప్పి స్ట్రోలర్‌ని పుష్ చెసుకుంటూ రూమ్ బయటకు నడిచింది తేజ

ఆమె–తేజ కాదు...ఒక పవిత్ర స్త్రీ మూర్తి ... మాతృమూర్తి...కరుణామూర్తి... అపర సరస్వతీ దేవి...సమాజాన్ని ముందుకు నడిపించగల శక్తి...ఆమె సముద్రంలో నీటి బొట్టుకాదు .. సముద్రంలో అపురూపంగా దొరికే పెన్నిధి. తేజ పెంపకంలో విక్రమ్ ఒక విశిష్ట వ్యక్తిగా రూపొందుతాడు. మనసులోనే ఆ స్త్రీకి జోహారులర్పించాను. ★

